అభ్యుదయ జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
ఆదివారం 22 జనవరి 2023

మనస్తాపంతో పురుగులమందు తాగి ఆత్మహత్య

నవతెలంగాణ - సిర్పూర్(టి)

మండలంలోని పారిగాం గ్రామానికి చెందిన టుర్కె రమేష్(47) మనస్తాపంతో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ డీకొండ రమేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. బంధువుల శుభకార్యానికి వెళ్లడానికి భార్య అనసూయ భర్తను డబ్బులడిగింది. తన వద్ద డబ్బులు లేవని చెప్పాడు. తమ బంధువుల శుభకార్యానికి వెళ్లడానికి డబ్బులుండవు కాని తాగడానికి ఉంటాయని భార్య భర్తతో వాదనకు దిగింది. రమేష్ తీవ్ర మనస్తాపానికి గురై సాయంత్రం పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనతో తెలిసిన వారందరినీ అడిగారు. ఉదయం కర్జెపెల్లి గ్రామ శివారులో పశువుల కాపర్లు మృతదేహాన్ని గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు రజినీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విజయం సాధించే వరకు పట్టు వదలొద్దు

- ఎమ్మెల్యే ఆత్రం సక్కు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విజయం సాధించే వరకు పట్టు వదలకూడదని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. జిల్లా కేంద్రంలోని కొమురం భీం స్టడీ సర్కిల్ ఉద్యోగార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల నుండి వచ్చి ఉద్యోగాల కోసం కృషి చేస్తున్న ప్రతి ఒక్కరు విజయం సాధించేవరకు పట్టువదలకూడదన్నారు. ఉద్యోగ సాధన తర్వాత జీవితం ఎంతో మార్పు చెందుతుందన్నారు. పిల్లలపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు వమ్ము చేయకుండా ప్రయత్నం చేయాలన్నారు. కావాల్సిన సౌకర్యాలు కల్పించడానికి సిద్ధంగా ఉంటానని నిరుద్యోగులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ నిర్వాహకులు ఊశన్న, రాజశేఖర్, పిఈటి రాకేష్ పాల్గొన్నారు

మీ సేవ ముసుగులో దోపిడీ..!

- ఈకేవైసీ పేరుతో డబ్బులు స్వాహా
- బ్యాలెన్స్ తనిఖీ చేసినా, ఈకేవైసీ చేసినా డబ్బులు మాయం
- పలుమార్లు మోసాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ- కోటపల్లి

మండలంలోని ఆలుగామ మీ సేవ కేంద్రంలో రోజుకో అవినీతి బయట పడుతోంది. కష్టపడి సంపాదించిన సొమ్మును తీసుకునేందుకు మీ సేవకు వెళ్లిన వినియోగదారులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. బ్యాంకు దాకా వెళ్లలేని అత్యవసర పనిమీద డబ్బులు అవసరమైనవారు మీసేవకు వెళితే నిర్వాహకులు మోసాలకు పాల్పడుతున్నారు. ఈ మీసేవ కేంద్రంపై పలుమార్లు ఇలాంటి ఆరోపణలు వచ్చినా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి. తూతూ మంత్రంగా విచారణ జరిపి మమ అనిపిస్తున్నారు. సదరు వ్యక్తులపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో దోపిడీ పర్వాన్ని ఆపడం లేదని తెలుస్తోంది.

సులువుగా ఉంటుందని..

ఈ రోజుల్లో ఎవరికైనా రూ.5వేల నుంచి రూ.10వేల వరకు అత్యవసరమై ఉంటే బ్యాంకు దాకా వెళ్లడం ఎందుకని సమీపంలోని మీసేవా కేంద్రానికి వెళ్లి ఏఈపీఎస్ ద్వారా తీసుకుంటుంటారు. ఇదే అదనుగా తీసుకుంటున్న సదరు నిర్వాహకుడు బ్యాలెన్స్ తనిఖీ చేసినా డబ్బులు డ్రా చేసినా, ఈకేవైసీ చేసినా సదరు ఖాతాల్లో నుంచి డబ్బులు ఖాళీ చేస్తూ అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్నాడు. వినియోగదారులు అడిగిన వాటి కంటే ఎక్కువ డబ్బులను వారి ఖాతాల నుంచి డ్రా చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. ఉపాధిహామీ, రైతుబంధు, పీఎం కిసాన్ డబ్బులు తదితర వాటిలో కొంతైనా వినియోగదారుల ఖాతాల నుంచి తీసుకోవడం పరిపాటిగా మారుతోందని ఆరోపణలున్నాయి.

అమాయక ప్రజలే గురి

మండలంలోని జనగామ, రొయ్యలపల్లి, ఆలుగామ, సుపాక, నంద్రంపల్లి, వేంచపల్లి గ్రామాల ప్రజలకిది ఒక్కటే మీ సేవ కేంద్రం. దీన్ని ఆసరా చేసుకుంటున్న మీసేవ నిర్వాహకుడు పలుమార్లు మోసాలకు పాల్పడుతున్నా అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ కేంద్రంపై ఇది వరకు పలు ఆరోపణలు వచ్చినా అధికారులు పట్టించుకోకపోవడం వెనుక అంతర్యమేముందోనని జనాలు చర్చించుకుంటున్నారు.

అడిగితే ఇవ్వడం..లేకుంటే అంతే

అమాయక ప్రజలను ఆసరా చేసుకొని ఇలా ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారు. ఈ మోసాన్ని గ్రహించి మళ్లీ అడిగితే ఏదో ఒక సాకు చెప్పి డబ్బులు తిరిగి ఇవ్వడం పరిపాటిగా మారింది. ఒకవేళ సదరు వినియోగదారులు అడగకపోతే అంతే సంగతి. ఈ విధంగా పలుమార్లు జరిగినట్లు సదరు మీసేవా కేంద్రం పరిసర ప్రాంత ప్రజలు చెబుతున్నారు. ఇలా చేయడం అలవాటుగా మారిపోయింది. అందుకనే ఏన్ని సార్లు పట్టుబడిన భయం లేకుండా ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

విచారణ అంతంత మాత్రమే

మండల ప్రజలను ఇన్ని మోసాలకు గురిచేస్తున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు ఉండటం వెనక ఉన్న ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని జనాలు అంటున్నారు. అధికారులకు మామూళ్లు ముడుతున్నాయా? తీసుకున్న డబ్బులతో కమిషన్ రూపంలో వెళ్తున్నాయా అనే ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. ఇంత అవినీతి చేస్తున్నా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాకు తెలియకుండానే రూ.4వేలు తీసుకున్నాడు : గంట సంతోష్, బాధితుడు, జనగామ



పీఎం కిసాన్ నిధులు రాకపోవడంతో ఒకసారి ఈకేవైసీ చూయించుకునేందుకు మీసేవ కేంద్రానికి వెళ్లాను. ఆధార్‌కార్డు, వేలి ముద్రల సాయంతో రూ.4వేలు తీసుకున్నాడు. అనంతరం రూ.25వేలు డ్రా చేద్దామని బ్యాంకుకు వెళ్లి చూడగా అకౌంట్‌లో రూ.21వేలు మాత్రమే ఉన్నాయి. ఎక్కడ డబ్బులు కట్ అయ్యాయని తెలుసుకుంటే అలుగామ మీసేవ కేంద్రం నుంచి తీసుకున్నట్లు తేలింది. సదరు నిర్వాహకుడిని అడిగితే బెదిరింపులకు దిగుతున్నాడు. అధికారులు స్పందించి మీసేవ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలి.

పిల్లల రవాణా, మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పిల్లల అక్రమ రవాణా, మత్తు పదార్థాలు వినియోగం అరికట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయం నుండి సంబంధిత శాఖల అధికారులతో పిల్లల్లో డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా అరికట్టేందుకు తీసుకోవలసిన చర్యలపై ఆయా శాఖల అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, పిల్లల అక్రమ రవాణా వంటి వాటిని పోలీస్ యంత్రాంగం సహకారంతో నిరోధించాలన్నారు. విద్యాసంస్థల సమీపంలో మత్తు ద్రవ్యాలు, పానీయాలు అమ్మకాలు సాగించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ పిల్లలకు గుట్కా వంటి పదార్థాలు అమ్మిన వారి నుండి అపరాధ రుసుము వసూలు చేయడం జరిగిందని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైన్ షాపుల్లో పిల్లలకు మత్తు పానీయాలు అమ్మకుండా సిసి కెమెరాలు అమర్చడం జరిగిందని తెలిపారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ శ్రీనివాస్‌రావు, జిల్లా సంక్షేమ అధికారిణి మిల్కా, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు దిలీప్ కుమార్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఆబ్కారీ శాఖల అధికారులు, స్వచ్చంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించాలి



జైనూర్ : ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని పెంపొందించాలని మండల విద్యాధికారి కుడిమెత సుధాకర్ అన్నారు. శనివారం లింగాపూర్ మండలంలోని కొలాంగూడ, కన్నెపెల్లి, గోండుగూడ, లింగాపూర్‌తో పాటు మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్య సామర్థ్యాలను పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల హాజరు శాతం పెంచేలా కృషి చేయాలన్నారు. టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ ప్రతి పాఠశాలలో అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. బయోమెట్రిక్ విధానం ద్వారా ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలని తెలిపారు. పోషకులతో సమావేశం నిర్వహించి విద్యార్థులు బడికి వచ్చేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్పీ సంజీవ్‌కుమార్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, AT: ADILABAD.
O.S. No. 76 OF 2021
BETWEEN:-
Tokala Chinna Deva Reddy .....Plaintiff
AND
Gujarathi Gopi & others .....Defendants
To.
Bharonikani Shiva Narayana Nageshwari (D-2) W/o. Chintakuri Ramdas, Aged about: 56 years Occ: Govt. Employee R/o. Sirpur Kagaznagar Town Mandal Sirpur, Adilabad District. .....Defendant No. 2
Please take notice that the above named Plaintiff has filed the above Suit for Perpetual Injunction and Mandatory Injunction, against you on the Hon'ble Junior Civil Judge, at: Adilabad and the matter is stand posted on 01-02-2023 at 10:30 AM for your appearance and written Statement if any, failing which the Hon'ble court will proceed with the matter as per Law.
//By order of the Court//
M/s Muhammad Veqar Hussain (Advocate)
Office at: 16-2-743/1/C/1, Tayyab Heights Apt., Saidabad, New Malakpet, Hyderabad Ph: 8187024927

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, AT: ADILABAD
I.A. No. 120 of 2021
IN
O.S. No. 76 OF 2021
BETWEEN:-
Tokala Chinna Deva Reddy .....Plaintiffs
AND
Gujarathi Gopi & others ...Defendants
To.
1. Bharonikani Shiva Narayana Nageshwari (R-2) W/o. Chintakuri Ramdas, Aged about: 56 years, Occ: Govt. Employee R/o. Sirpur Kagaznagar Town Mandal Sirpur, Adilabad District. ....Respondent/Defendant No. 2
Please take notice that the above named Plaintiffs has filed the above petition U/o. 39 rule 1 & 2 of CPC for Interim Injunction against you on the Hon'ble Junior Civil Judge, at: Adilabad and the matter is Stand posted on 01-02-2023 at 10:30 AM for your appearance and written Statement / Counter if any, failing which the Hon'ble court will proceed with the matter as per Law.
//By order of the Court//
M/s Muhammad Veqar Hussain (Advocate)
Office at: 16-2-743/1/C/1, Tayyab Heights Apt., Saidabad, New Malakpet, Hyderabad Ph: 8187024927

బాధిత కుటుంబానికి చేయూత

బెజ్జూర్ : మండలంలోని పెద్దసిద్దాపూర్ గ్రామానికి చెందిన భూస లక్ష్మి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో దాతల సాయం సామాజిక మాధ్యమాల ద్వారా కోరింది. దాతల ద్వారా సేకరించిన రూ.7,150 విరాళాలతో పాటుగ్రామ యువకులు సేకరించిన రూ.8వేలను బాధితురాలి కుటుంబసభ్యులకు అందజేశారు. దీంతో సామాజిక మాధ్యమాల ద్వారా విరాళాలు అందించిన వారికి, విరాళాలు సేకరించి ఇచ్చిన గ్రామ యువకులకు బాధిత కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ జావీద్, కుదురుపాక సంజీవ్, బొజ్జ మహేష్, టాకిరె బాలాజీ, గణపతి, సిద్దాపూర్ ఉప సర్పంచ్ టాకిరె శ్రీనివాస్, ఆర్ఎంపీ వైద్యులు రమేష్ పాల్గొన్నారు.

నేడు జాతర వేలంపాట

వాంకిడి : మండల కేంద్రంలో నిర్వహించే మహా శివరాత్రి జాతరకు సంబంధించి దుకాణ సముదాయాల ఏర్పాటుకు ఆదివారం ఉదయం 10.30గంటలకు వేలం పాట నిర్వహిస్తామని శివకేశవ ఆలయ కమిటీ చైర్మన్ గాదె ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

మానవళికి కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసిన లెనిన్

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తొడసం భీంరావు
- ఆదిలాబాద్, కాగజ్‌నగర్‌లో లెనిన్ 98వ వర్ధంతి వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

మానవళికి కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసిన వ్యక్తి లెనిన్ అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తొడసం భీంరావు అన్నారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ 98వ వర్ధంతి వేడుకలను స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భీంరావు మాట్లాడుతూ లెనిన్ 1924 జనవరి 21న మరణించారని, ప్రపంచ వ్యాప్తంగా ఆ రోజును లెనిన్ వర్ధంతిగా జరుపుకుంటారన్నారు. లెనిన్‌ను స్మరించుకోవడం గొప్ప బాధ్యతగా భావించాలని కార్మికులకు సూచించారు. లెనిన్‌కు నివాళి అర్పించడం అంటే ప్రాపంచిక దృష్టిని, విప్లవ కార్యాచరణను అర్థం చేసుకోవడమే అవుతుందన్నారు. లెనిన్ తన జీవితకాలంలో ప్రతి విషయాన్ని సూక్ష్మంగా పరిశీలించేవాడని పేర్కొన్నారు. 1893లో లెనిన్ తన మొదటి రష్యన్ రచన రైతాంగ జీవితంలో నూతన ఆర్థిక పరిణామాలు అనే గ్రంథాన్ని రచించారన్నారు. 1894లో ప్రజా మిత్రుల నిజ స్వరూపం అనే మరో గ్రంథాన్ని కూడా రచించారని, వాటి ఆచరణ కోసం ఆయన మొత్తం రష్యన్ గ్రామీణ సమాజాన్ని అధ్యయనం చేశాడని గుర్తు చేశారు. రష్యాలోని నిరంకుశ ప్రభుత్వం ఆయనను వెంటాడిన విప్లవ కార్యాచరణ ఆగలేదని తెలిపారు. 1897 ఫిబ్రవరి 13 నుంచి 1900 జనవరి 29 వరకు మూడు సంవత్సరాల పాటు ఆయన తూర్పు నైజీరియాలో ప్రవాస(జైలు) శిక్షణ అనుభవించారన్నారని పేర్కొన్నారు. వలస జీవితం ముగిసిన అనంతరం లెనిన్ పార్టీకి, రష్యా విప్లవ పోరాటానికి ప్రత్యక్ష నాయకత్వం వహించాడన్నారు. 1917లో రష్యాలో కార్మిక వర్గాన్ని రాజ్యాధికారంలోకి తీసుకొచ్చి ప్రపంచ మానవాళికి కొత్త లోకాన్ని పరిచయం చేశారని అభివర్ణించారు. మార్క్స్ అందించిన మానవాళి విముక్తి సిద్ధాంతాన్ని ఆచరణలో తెచ్చిన వ్యక్తి లెనిన్ అని కొనియాడారు. ప్రపంచంలో పెట్టుబడిదారి వ్యవస్థ మానవాళికి పరిష్కారం చూపలేదని, రోజురోజుకూ ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేయబడుతుందని అన్నారు. పెట్టుబడిదారి వ్యవస్థ ఆర్థిక సంక్షోభానికి పరిష్కారం చూపలేదని, అది కేవలం సోషలిజం ద్వారానే సాధ్యమని తెలిపారు. కమ్యూనిస్టు కార్యకర్తలు లెనిన్ స్ఫూర్తితో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, నాయకులు ఆర్.మంజుల, ఎన్.స్వామి, కె.ఆశన్న, లంక జమున, దీపక్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : మార్క్సిజానికి లెనిన్ జీవం పోశారని టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ అన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సీఐటీయూ కార్యాలయంలో రష్యా విప్లవ యోధుడు లెనిన్ 99వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచానికి మార్క్స్ సిద్ధాంతాన్ని అందిస్తే దాన్ని అన్వయించి రష్యాలో విప్లవం సాధించిన మహనీయుడు లెనిన్ అన్నారు. ప్రపంచ కమ్యూనిస్ట్ ఉద్యమానికి దిక్సూచిగా నిలిచారని తెలిపారు. తన 24వ యేటనే "కార్మికుల లక్ష్యం" అనే పత్రికకు సంపాదకత్వం వహించారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపి మత రాజకీయాలు చేస్తూ, దేశంలో విద్వేషాలు సృష్టిస్తూ దేశ సంపదను అమ్ముతోందని తెలిపారు. బీజేపి మత రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాడాలని, హక్కుల రక్షణ కోసం పని చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్ కుమార్, సీఐటీయూ జిల్లా నాయకులు ఎన్. పద్మ, జి.లక్ష్మి, కన్నుబాయి, జి.సంజీవ్, శంకరమ్మ, ఐద్వా జిల్లా కార్యదర్శి దుర్గం అనిత పాల్గొన్నారు.

వాంకిడి :మండలంలోని కిర్డీ గ్రామంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ ఆధ్వర్యంలో శనివారం లెనిన్ 99వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులు లెనిన్‌ను ఆదర్శంగా తీసుకొని ఆయన మార్గంలో నడవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేకవిధానాలపై అవగాహన కలిగి ఉండి పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు నిఖిల్, జిల్లా కమిటీ సభ్యుడు తిరుపతి, మనోహర్, కేవీపీఎస్ నాయకులు వాసుదేవ్, కిరణ్ పాల్గొన్నారు.



చిరుధాన్యాలపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్

మండలంలోని మామిడిగూడ గ్రామంలో శనివారం చిరుధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా గ్రామంలో పలు వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జెడిఎ పుల్లయ్య రైతులకు చిరు ధాన్యాలపై అవగాహన కల్పించారు. సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు తెలియపరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాదవ్‌రావు, మండల వ్యవసాయ అధికారి అశ్రఫ్ అహ్మద్. ఏఈఓలు ఉమా, ప్రసాద్, శివ, నరేష్, కావ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.



అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలి



నవతెలంగాణ-కుభీర్

ప్రజలను మభ్యపెట్టడం మానుకొని ఇకనైనా అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు బోస్లే మోహన్‌రావు పటేల్ అన్నారు. శనివారం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో స్వామి వివేకానంద విగ్రహ సమీపంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పేదలతో కలిసి ర్యాలీగా వివేకానంద విగ్రహం వద్దకు చేరుకున్నారు. ప్రధాన రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. తహసీల్దార్ రావాలంటూ నినాదాలు చేశారు. తహసీల్దార్ రాస్తారోకో స్థలానికి రావడంతో వినతిపత్రం అందజేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల విషయంలో తహసీల్దార్ విశ్వంబర్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు పటేల్ మాట్లాడుతూ నవంబర్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ పాదయాత్రను బిఆర్ఎస్ గూండాలు అడ్డుకునే ప్రయత్నం చేశారని, రజాకార్ల పాలనను తలపిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని చెప్పిన కేసీఆర్ ఇప్పటి వరకు ఇవ్వలేదని తెలిపారు. ఇటీవల స్థలం ఉన్న వారికి రూ.5లక్షలు ఇంటి నిర్మాణం కోసం ఇస్తామని మభ్యపెడుతున్నారని విమర్శించారు. హామీలు విస్మరించిన కేసీఆర్ రానున్న ఎన్నికల్లో పేదల ఆగ్రహానికి గురికాక తప్పదని పేర్కొన్నారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు వచ్చేంత వరకూ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పువ్వుల లింగం, పెడిపెల్లి గంగాధర్, మాజీ ఎంపీపీ కమలేష్, సాయినాథ్, కౌన్సిలర్ దిలీప్, గాలి రవి, నాయకులు పండిత్ జాదవ్, పోశెట్టి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగిసిన బైరామ్‌దేవ్, మహదేవ్ జంగి జాతర



నవతెలంగాణ-బేల

మండలంలోని సదల్‌పూర్ గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న బైరామ్ దేవ్, మహదేవ్ జంగి జాతర శనివారం ముగిసింది. కొరంగే సోనేరావ్ దంపతులు అభిషేకం పూజ నిర్వహించి, దహి హండి కాళతో ముగిసింది. అంతకు ముందు నూతన జెండాకు వస్త్రంతో ధ్వజరోహణ నిర్వహించారు. వారం రోజులుగా కొనసాగుతున్న ఈ జాతరలో నిత్యం వేలాది సంఖ్యలో భక్తులు వచ్చి నైవేద్యాలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెలంగాణ ప్రాంతాల నుండే కాకుండా ఆంధ్ర, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ నుండి వేలాది సంఖ్యలో భక్తులు ప్రతి ఏటా వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా ఆలయ కమిటీ, గ్రామ పంచాయతీ తరపున విద్యుత్, మంచి నీటి వసతి, పార్కింగ్ సౌకర్యంతో పాటు తాత్కాలిక మూత్రశాలలు ఏర్పాటు చేశారు. పోలీసుల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు పర్యవేక్షణ కొనసాగించారు. మహా దేవ్, బైరామ్ దేవ్‌ను బిజెపి నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు సోనేరావ్ మాట్లాడుతూ వారం రోజులుగా కొనసాగిన ఈ జాతరలో వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారని, చివరి రోజు దహి హండి కాళ, అన్నదాన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని ముత్తంపేట గ్రామంలో మహాత్మా జ్యోతిబాపూలే వాలీబాల్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఇందులో మొదటి విజేతగా ముత్తంపేట గ్రామానికి చెందిన యువకులు ప్రథమ బహుమతి దక్కించుకోగా వారికి రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు రూ.15వేల నగదు బహుమతి అందజేశారు. ద్వితీయ బహుమతిని కౌటాల టీం దక్కించుకోగా వారికి ముత్తంపేట సర్పంచ్ ఆదె శ్రీనివాస్ రూ.10వేల నగదు బహుమతి అందజేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు మాట్లాడుతూ క్రీడలు యువతకు ఎంతగానో దోహదపడతాయని, అందులో వాలీబాల్ క్రీడ వల్ల శరీరం దృఢంగా తయారవుతుందని తెలిపారు. క్రీడాకారులు ఈర్ష్యాద్వేషాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో వాలీబాల్ టోర్నమెంటును ముగించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదె వసంత్‌రావు, సర్పంచ్ ఆదె శ్రీనివాస్, ఉప సర్పంచ్ వెంకటేశ్, మాలీ సంఘం కాగజ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు లెండుగురె శంకర్, మాజీ ఎంపీపీ నికోడె గంగారం, మాలీ సంఘం నాయకులు ఆదె నాందేవ్, దోని అంజన్న, గణేష్, ప్రకాష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న పిండి గిర్ని యజమాని

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన అక్కల గోపాల్ బియ్యంలో వచ్చిన బంగారాన్ని బాధితునికి ఇచ్చి నిజాయితీ చాటుకున్నాడు పిండి గిర్ని యజమాని. తానిమడుగు గ్రామపంచాయతీ పరిధిలోని నాయకపుగూడ చెందిన నాయిడి చిన్న పోచం శనివారం అక్కల గోపాల్ వద్దకు బియ్యం తీసుకొని వచ్చాడు. పిండి గిర్ని నిర్వహిస్తున్న గోపాల్‌కు ఇచ్చి కిరాణా షాప్‌కు వెళ్లాడు. బియ్యం పడుతున్న సమయంలో అందులో రూ.20వేల విలువ గల బంగారం కనపడింది. తీసుకొని బాధితునికి అప్పగించాడు. నిజాయితీ చాటుకున్న అక్కల గోపాల్‌ను పలువురు అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కుభీర్

పేద ప్రజలకు అండగా నిలిచేందుకు సీఎం కేసీఆర్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేయడం జరుగుతుందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. శనివారం ముధోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని 13 గ్రామాలకు చెందిన 16 మంది లబ్దిదారులకు దాదాపుగా రూ.8లక్షల 95వేల 500 సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజక వర్గంలో ఉన్న పేద ప్రజల ఆరోగ్యం కొరకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమం నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి తూమ్ రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ చౌహన్ శంకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కందూర్ సంతోష్, కోఅప్షన్ సభ్యుడు దత్తుహరి పటేల్, మండల రైతు అధ్యక్షులు పువ్వుల పిరాజీ, హంపోలి సర్పంచ్ నర్సారెడ్డి, మండల సర్పంచ్‌లు ఎంపీటీసీలు, నాయకులు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
ఆదివారం 22 జనవరి 2023

నాగోబా జాతర ఏర్పాట్ల పరిశీలన

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

నాగోబా జాతరలో భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఐటీడీఏ పీఓ కె.వరుణ్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతర ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఆర్టీసీ బస్‌స్టాప్, క్రీడా ప్రాంగణం, పార్కింగ్ స్థలాలు, పోలీస్ కంట్రోల్ రూమ్, హెలీప్యాడ్, భక్తుల క్యూలైన్ బార్కెట్లు, ప్రభుత్వ శాఖల స్టాల్స్ తదితర ఏర్పాట్లను పీఓ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కె.సురేష్, ఎపీఓ ఆత్రం భాస్కర్, ఆలయ ఈఓఎం రాజమౌళి, ఆలయ పీఠాధిపతి వెంకటరావు, ఈఈ రాథోడ్ భీమ్‌రావ్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఏఓ రాంబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ పరిశీలన

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్, పారిశ్రామిక జోన్‌ను మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ శనివారం పరిశీలించారు. స్థానిక విశ్వనాథ్ పేట్, గాజులపేట్, తల్వేద, మంజులాపూర్ ప్రాంతాల్లో రహదారులు, బైపాస్ రోడ్డు విస్తరణపై మ్యాపును టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. మాస్టర్‌ప్లాన్, పారిశ్రామిక జోన్‌కు సంబంధించి రైతులు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. రైతులు ఎవ్వరు అపోహలు నమ్మవద్దని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి రైతులకు అండగా ఉంటారని పేర్కొన్నారు. రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని కోరారు. చైర్మెన్ వెంట టీపీఓ సుమలత, టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఉన్నారు.

పట్టణ స్వర్ణకార సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణ స్వర్ణకార సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉదారి నగేష్, ప్రధానకార్యదర్శిగా తిప్పర్తి సత్యం, సభ్యులుగా ఉదారి దయానంద్, నూనె యాదవ్, అనుసూరి అనిల్, రావుల వేణు, ఉదారి చిరంజీవి, సజ్జనపు లక్ష్మణ్, రాజులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను పలువురు అభినందించారు. అనంతరం రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో నాయకులు కాటోజు భాస్కర చారి, ఉదారి శేషన్న, కట్ట కృష్ణ స్వామి పాల్గొన్నారు.

రేషన్ బియ్యాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-బోథ్

ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ షాపుల్లోని పౌష్టికాహారంతో ఉన్న బియ్యాన్ని ప్రతి ఒక్కరూ తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని సూర్యనగర్, సాకేర, రేషన్‌షాపులను తనిఖీ చేసి, అనంతరం గ్రామస్తులతో పౌష్టికాహారంతో ఉన్న బియ్యంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి నెల నెల రేషన్ షాప్‌లో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం, పోలిక్ యాసిడ్, ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రతి ఒక్కరూ తీసుకొని తినాలని సూచించారు. తిన్నట్లయితే ప్రతి ఒక్కరూ ఆరోగ్యం ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్యాంసుందర్, ఉపసర్పంచ్ బిక్కులాల్, గ్రామస్తులు ధారావ రమేష్, భీమ్‌రావు, దత్త నానాజీ, ధనరాజ్, పాల్గొన్నారు.

మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-నిర్మల్

ఓ వర్గ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ శ్రీనివాస్ శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో గత నెలలో టిప్పు సుల్తాన్ జయంతి సందర్భంగా ముఖ్య వీధుల గుండా టిప్పు సుల్తాన్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ షాహిద్ అలియాస్ ముక్తాదిర్ అధ్యక్షతన ర్యాలీ తీశారు. ర్యాలీలో ఎలాంటి అనుమతి లేకుండా డీజె సౌండ్, స్పీకర్స్ పెట్టి ఒక వర్గానికి చెందిన ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా స్లొగన్స్ ఇచ్చారు. చాట విరుద్ధంగా రోడ్డుపైన ధర్నా చేశారు. ఈ మేరకు గతంలో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం అతనిని అరెస్టు చేశామని తెలిపారు. ఎవరైనా సరే ఒక వర్గానికి చెందిన వారి మనోభావాలను దెబ్బతీసే విధంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన, రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించిన వారిపైన చట్టరిత్యా చర్యలు తీసుకోవడమే కాకుండా వారిపైన పీడీ యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని సీఐ హెచ్చరించారు.

పెద్దమ్మగుడిలో దొంగల అలజడి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

పెద్దమ్మ ఆలయంలో దొంగలు పడి అలజడి సృష్టించిన సంఘటన మండలంలోని చంద్రాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పెద్దమ్మ ఆలయ తలుపులకు గల తాళం పగులగొట్టి ఆలయంలోకి వెళ్లారు. పెద్దమ్మ దేవతపై గల మంగళ సూత్రం, హుండీలోని డబ్బులను దొంగతనం చేసినట్లు ఉదయం గుర్తించామని అన్నారు. ఈ విషయంపై ఎస్సై రాహుల్ గైక్వాడ్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఫిర్యాదు ఆదారంగా పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న గంజాయి పట్టివేత

నవతెలంగాణ-గుడిహత్నూర్

అదిలాబాద్ జిల్లా కేంద్రం నుండి కరీంనగర్‌కు అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని శనివారం గుడిహత్నూర్ బస్టాండ్‌లో పట్టుకున్నట్లు ఎస్సై ఎల్.ప్రవీణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా జన్నారంకు చెందిన మాడుగుల ప్రజ్యోత్, కరీంనగర్‌కు చెందిన కోడి సాయిరాంతో కలిసి అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కేఆర్కే కాలనీకి చెందిన సమీర్ వద్ద 500 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి తిరిగి కరీంనగర్ వెళ్లేందుకు గుడిహత్నూర్ బస్టాండ్‌లో వేచి చూస్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ కవర్‌ని తనిఖీ చేయగా అందులో ఎండు గంజాయి ఉండటంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పోలీసుల సమక్షంలో తహసీల్దార్ సంధ్యారాణి పంచనామా నిర్వహించారు. వారిరువురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. పట్టుకున్నవారిలో ఎస్సై ప్రవీణ్‌తో పాటు, ఏఎస్సై రహమాన్ ఖాన్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివేకానంద సేవా సమితి వారి అధ్వర్యంలో పరీక్షపై చర్చా కార్యక్రమంలో భాగంగా చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ చదువుకునే విద్యార్థుల్లో పరీక్షపట్ల ఉన్న భయాన్ని పోగొట్టి ఉత్సాహన్ని నింపడానికి 28 సూత్రాలతో ఎగ్జాం వారియర్ అనే పుస్తకాన్ని రాశారని తెలియజేశారు. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కేజీబీవీ, జెడ్పీఎస్ఎస్, అరవింద స్కూల్, ఉర్దూ మీడియం విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రగతి పత్రాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్ రావు, సమితి అధినేత నాయుడి మురళీధర్, ఎంపీడీఓ సూపరింటెండెంట్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు మోహన్‌రావు, భూమేష్, నర్సయ్య యువనాయకులు అర్జున్, నరేందర్, శేఖర్, సవిన్, మహేశ్, ప్రశాంత్, సంతోష్, సాయిలు పాల్గొన్నారు.

పరీక్షలకు ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-నిర్మల్

22న జరుగునున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవేశ పరీక్ష కొరకు నిర్మల్ నుండి నిజామాబాద్‌కు ఉదయం 7 గంటలకు నుండి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎన్.సాయన్న శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ముందస్తుగా ఆన్‌లైన్ రిజర్వేషన్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌ఆర్టీసీఆన్‌లైన్.ఇన్ ద్వారా కానీ నిర్మల్ బస్టాండ్ వద్ద రిజర్వేషన్ కౌంటర్ వద్ద టికెట్లు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్లు 7382842265, 9492767879 సంప్రదించాలని కోరారు.

క్రీడా స్ఫూర్తితో విజయాలు సాధించాలి

- ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

నవతెలంగాణ-గుడిహత్నూర్

ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని, ఆ స్ఫూర్తితో భవిష్యత్‌లో అద్భుత విజయాలు సాధించాలని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శనివారం మండలంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను అయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల మనోభావాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు క్రీడా ప్రాంగణాలను నిర్మించి పెద్దపీట వేసిందని అన్నారు. క్రీడల ద్వారా మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని అన్నారు. క్రీడాకారులు పోటీతత్వం అలవర్చుకోవాలని, అవకాశాలను సద్వినియోగం చేసుకొని విజయాలు సాధించాలని పేర్కొన్నారు. ఆటలతో పాటు చదువులోనూ కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సునీతా జాదవ్, బీఆర్ఎస్ కన్వీనర్ కరాడ్ బ్రహ్మనంద్, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు బూర్ల లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ సత్యరాజ్, మాజీ ఎంపీటీసీ కోల్హారి వినోద్, నాయకులు మాధవ్



కేంద్రే, సలీంఖాన్, రాహుల్, దీలీప్, రావణ్, జలంధర్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన కోసమే న్యాయ విజ్ఞాన సదస్సు



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడానికి న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామని బోథ్ జడ్జి బి హుస్సేన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సంధ్బంగా జడ్జి బి హుస్సేన్ మాట్లాడుతూ రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందని, హక్కులతోపాటు బాధ్యతలను విధిగా నెరవేర్చాలని అన్నారు. విద్యార్థులు బాల్యం నుండే చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని అందులో భాగంగా విద్యార్థులకు బాలకార్మిక నిర్మూలన, విద్యాహక్కు చట్టం, లైంగిక వేధింపులు, మోటారు వెహికల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టాలు కోర్టు పరిధిలో జరిగే విషయాలు గురించి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. భ్రూణ హత్యలు చేయరాదని, బాలలను కార్మికులుగా మార్చి శ్రమ దోపిడీకి పాల్పడొద్దని అన్నారు. గర్భస్థ శిశువు పిండ నిర్ధారణకు పూనుకుంటే, మానవ అక్రమ రవాణా చేస్తే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. వయోవృద్ధుల సంక్షేమ చట్టం, గిరిజనుల హక్కులు, ఆస్తి హక్కు, జాతీయ ఆహార భద్రత చట్టంపై న్యాయం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ పంద్రం శంకర్, న్యాయవాదులు రూపేందర్ సింగ్ ఠాకూర్, ఆడెపు హరీష్, కుమ్మరి విజయ్ కుమార్, ఎస్సై సయ్యద్ ముజాయిద్, ప్రిన్సిపాల్ రాజశేఖర్, పోలిసు సిబ్బంది మాల్యాల భూమేష్, విజయ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏసీడీ పేరుతో విద్యుత్ బిల్లులు దండుకుంటున్న ప్రభుత్వం

నవతెలంగాణ-కడెం

ఏసీడీ పేరుతో విద్యుత్ శాఖ బిల్లులు దండుకుంటుందని, దీంతో వినియోగదారులపై మోయలేని భారాలను మోపుతోందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులుసునారికారి రాజేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని హరితలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏసీడీ, డెవలప్‌మెంట్, యూజర్ చార్జీలు అడ్డగోలుగా వసూళ్ల చేస్తున్నారని అన్నారు. కరెంట్ చార్జీలు కట్టడం ఆలస్యం అయితే 18శాతం పెనాల్టీ వేస్తున్నారని అన్నారు. విద్యుత్ చార్జీల మోతతో ప్రజలపై ఇప్పటికే మోయలేని భారం మోపారని అన్నారు. ఏసీడీ పేరుతో కొన్ని కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ బిల్లును నిలిపివేయాలని, వసూలు చేసిన బిల్లును తిరిగి వాపస్ చేయాలని అన్నారు. లేనిపక్షంలో విద్యుత్ కార్యాలయాలు ముట్టడి చేస్తామని అన్నారు.



బెంగాల్ వైద్యులపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బేల మండలంలో అమాయక ప్రజల ప్రాణాలతో బెంగాల్ వైద్యులు చెలగాటమాడుతున్నారని వారిపై చర్యలకు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని బెంగాల్ వైద్యులు అమాయక ఆదివాసీ ప్రజలను లక్ష్యంగా చేసుకొని వ్యాపారం సాగిస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేక గదులను ఏర్పాటు చేసుకొని అమాయక ఆదివాసీ ప్రజలకు వైద్యం పేరుతో కీళ్ల నొప్పులు, కాళ్ల నొప్పులకు, మోకాళ్ల నొప్పులకు ఇంజక్షన్లు వేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా బేల మండలంలోని చెప్రాల, సౌన్ కాస్, మశాల(బి)గూడ, దహెగాం గ్రామాల్లోని అమాయక ప్రజలకు బెంగాల్ డాక్టర్లు, కీళ్లనొప్పుల పేరుతో ఇంజక్షన్లు వేస్తూ కిడ్నీ సంబంధిత వ్యాధులకు కారకులవుతున్నారన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే అటువంటి బెంగాల్ వైద్యులపై చర్యలు తీసుకొని నాటు వైద్యం నుంచి ఆదివాసీల ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సానుకూలంగా స్పందించారనీ తెలిపారు. ఆయనను కలిసిన వారిలో బీంసరి ఉప సర్పంచ్ మల్లయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు రాకేష్, ఫయిమ్ ఉన్నారు.

కంటి వెలుగు శిబిరాలను ప్రతిరోజూ పర్యవేక్షించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

నవతెలంగాణ-నిర్మల్

కంటి వెలుగు శిబిరాలను ప్రతి రోజు పర్యవేక్షించాలని, శిబిరాలలోని సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వి, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేత మహంతి, సంబంధిత ఉన్నత అధికారులతో కలిసి కంటి వెలుగు నిర్వహణపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్‌పై సమీక్షించారు. జనవరి 19, 20వ తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల వివరాలను వైద్య శాఖ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కంటి వెలుగు శిబిరాలను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన జిల్లా కలెక్టర్‌లను, సంబంధిత అధికారులను అభినందించారు. ప్రతి వారం సోమవారం నుంచి శుక్రవారం వరకు క్యాంపులు జరుగుతాయని, శని, ఆదివారాలు క్యాంపులు ఉండవని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9.15 గంటల లోపు కంటి వెలుగు క్యాంపుల సమాచారం అప్‌డేట్ చేయాలని, జిల్లాలో ఉన్న క్వాలిటీ కంట్రోల్ బృందాలు విస్తృతంగా పర్యటించాలన్నారు. 2 రోజులు క్యాంపులో 11 జిల్లాల పరిధిలో 53శాతం పైగా కళ్లద్దాల పంపిణీ, ఆర్డర్ అవసరం అయ్యాయని తెలిపారు. జిల్లాలో ఉన్న బఫర్ బృందాలను ఉపయోగిస్తూ, జర్నలిస్టులకు, ఉద్యోగులకు, పోలీసులకు, కోర్టు సిబ్బంది, వివిధ వర్గాల వారికి ప్రత్యేక కంటి వెలుగు క్యాంపులను నిర్వహించాలని అన్నారు. జిల్లాలో రాబోయే 15 రోజులలో బఫర్ బృందాల ద్వారా ప్రత్యేక వర్గాల కోసం క్యాంపులు ఏర్పాటు చేయాలని, అవసరమైన షెడ్యూల్ తయారు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఉన్న రీడింగ్ కళ్లద్దాల స్టాక్‌ను కలెక్టర్‌లు ప్రతి రోజూ పర్యవేక్షించాలని, అవసరమైన కళ్లద్దాల స్టాక్ వివరాలు పాయింట్ల వారిగా ముందుగా సమాచారం అందిస్తే జిల్లాలకు సకాలంలో సరఫరా చేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే, డీఎంహెచ్‌ఓ ధన్‌రాజ్, డాక్టర్ శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

'ఫౌండేషన్ కోర్స్ సర్టిఫికెట్ ఎంతగానో ఉపయోగపడతాయి'

నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ రెండో, మూడో సంవత్సరం విద్యార్థినుల కోసం నిర్వహించిన ఫౌండేషన్ కోర్సు సర్టిఫికెట్‌తో ఉత్తమ సంస్థల్లో ఉద్యోగం పొందేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని వీసీ వెంకటరమణ అన్నారు. ఈ ఫౌండేషన్ కోర్సు గత నెల డిసెంబర్‌లో రెండు వారాల పాటు మైక్రోసాఫ్ట్ గ్లోబల్ స్కిల్స్ ఇనిషియేటివ్ ప్రోగ్రామ్ ఎడ్యునెట్ ఫౌండేషన్ ద్వారా 841 మంది విద్యార్థులు సర్టిఫికేట్‌లను పొందడానికి అర్హత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ సతీష్ కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డీన్ వి.చంద్రశేఖర రావు, ఫ్యాకల్టీ తేజస్వి సృజన, సారిక, చైతన్య పాల్గొన్నారు.

కర్ణాటక రాష్ట్రంలో డెంసా గుస్సాడీ ప్రదర్శన

నవతెలంగాణ-ఇచ్చోడ

మండలానికి చెందిన కాత్లే శ్రీధర్ సకల కళ బృందం శనివారం కర్ణాటక రాష్ట్రంలో చిక్కమంగళూరు జిల్లాలో జరిగిన ఆర్ట్స్ ఫెస్టివల్‌లో సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ తంజావూరు అధ్వర్యంలో ప్రదర్శన చేసిన కాత్లే శ్రీధర్ డెంసా గుస్సాడి బృందాలు అద్భుతంగా ప్రదర్శన చేసి అందరిని ఆకట్టుకుని మొదటి స్థానంలో నిలిచి, మొదటి బహుమతిని పొందినట్లు శ్రీధర్ తెలిపారు.

ముగిసిన ఖాందేవ్ జాతర

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో పుష్యమాసం సందర్భంగా ప్రారంభమైన ఖాందేవ్ జాతర శనివారంతో ముగిసింది. వివిధ రాష్ట్రాల నుంచి, చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు బారీగా తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయం హుండీ లేకింపు

ఖాందేవ్ జాతర శనివారంతో ముగియడంతో ఆలయ కమిటి సభ్యులు ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. బజార్ నుంచి వచ్చిన ఆదాయం రూ.86వేల 240, ఆలయం హుండీ రూ.68 వేల రెండు, మొత్తం రూ.1లక్ష 54 వేల 42 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యుడు తోడసం నాగోరావ్ పేర్కొన్నారు.



ప్రయివేట్ అంబులెన్స్ బోల్తా

నవతెలంగాణ-ఇచ్చోడ

మండల కేంద్రంలోని రాజీ జిన్నింగ్ సమీపంలో శనివారం ఉదయం 11గంటల సమయంలో ముందర ఉన్న వాహనాన్ని తప్పించబోయి చెనులోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది, డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న వ్యక్తి గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. మహబుబ్‌నగర్ జిల్లా నుంచి చత్తీస్‌ఘడ్‌కు డెడ్ బాడీని తరలించి అనంతరం తిరిగి ప్రయాణంలో ఘటన చోటుచేసుకుందని తెలిపారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలోని పలు మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖధికారి ప్రణీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బంగారిగూడ, ఆదిలాబాద్, బజార్‌హత్నూర్, బోథ్, గుడిహత్నూర్, జైనథ్, నార్నూర్ పాఠశాలలో 6, 7 నుండి 10వ తరగతి వరకు మిగిలిన సీట్ల కొరకు తెలంగాణఎమ్మెస్.సీజీజీ.గావ్.ఇన్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఫిబ్రవరి15వ అవకాశం ఉందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జీ ప్రమీలా జైన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు) సరస్వతి నగర్‌లో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొని ప్రసంగించారు. బాలికలు, యువత హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. విద్యాకు పేదరికం అడ్డు కాదన్నారు. తల్లిదండ్రుల ఆశయ దిశగా నడవాలన్నారు. కుటుంబ పరిస్థితులను గుర్తిస్తూ ఉన్నతంగా రాణించే, లక్ష్యాలను పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నాల నగేష్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, హెచ్ఎం మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫొటో మార్ఫింగ్ చేసిన వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-నిర్మల్

ఫోటో మార్ఫింగ్ చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ శ్రీనివాస్ శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. సుత్రావే గోపాల్ అనే వ్యక్తి సాయిబాబా ఫోటోని మార్ఫింగ్ చేసి, ఒక సినీ హీరో శరీరానికి సాయిబాబా ముఖాన్ని పెట్టి కింద బిజినెస్ మాన్ అని క్యాప్షన్ ఇచ్చి, ఒక వర్గానికి చెందిన వ్యక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎవరు కూడా సోషల్ మీడియాలో గాని, ఏవిధంగానైనా గాని ఒక వర్గానికి చెందిన వ్యక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన, రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలు చిన్నచిన్న విషయాలకు ఆవేశాలకులోనై, జీవితాలని నాశనం చేసుకోవద్దని సూచించారు.

ఉరేసుకొని యువతి ఆత్మహత్య

నవతెలంగాణ-ఉట్నూర్

తనకు ఆరోగ్యం భాగాలేదని మనస్తాపం చెంది ఉరేసుకొని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో సెరికల్చర్ క్వాటర్‌లో గొల్ల లక్ష్మీతో పాటుగా కూతురు శ్రీయ, కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నారు. గత ఆరు నెలల నుంచి శ్రీయ అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ క్రమంలో ఖానాపూర్‌లో ఉండే మృతురాలి అక్క వద్దక వెళ్లి వచ్చింది. అనారోగ్యం కారణంగా ఎప్పుడు బడపడుతుండేది. మనస్తాపం చెందిన యువతి శనివారం ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఫ్యాన్‌కి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతికి గల కారణాలు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-నిర్మల్

ఈనెల 25న 13వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆర్డీఓ స్రవంతి అన్నారు. కలెక్టర్ మినీ సమావేశం మందిరంలో సంబంధిత అధికారులతో కలిసి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఈ నెల 25న ఓటరు దినోత్సవం సందర్భంగా సంబంధిత బీఎల్ఓలు మండలాల వారిగా రంగోలి, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని, ప్రతి జిల్లాలో ఎన్నికల కమీషన్‌చే జారీ చేయబడిన పాటను మైక్‌ల ద్వారా వినిపించిన అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభాష్‌చందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల కన్వీనర్‌కు సన్మానం

నవతెలంగాణ-బోథ్

మండల నూతన కన్వీనర్‌గా ఎన్నికైన దామెర్ల నారాయణరెడ్డిని బీఆర్ఎస్ నాయకులు శనివారం క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. తనపై నమ్మకం ఉంచి మండల కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు నారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ యాదవ్, జిల్లా కోఆప్షన్ మెంబర్ తాహిర్, సోలంకి సత్యనారాయణ, రాజ్ కుమార్ కలీం, శేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

భూకబ్జాలు ఆపాలి

నవతెలంగాణ - సిర్పూర్(టీ)

మండల కేంద్రంలోని వారసంతలో భూకబ్జాలు చేసి ఇండ్లు నిర్మిస్తున్నారని, వీటిని అడ్డుకోవడానికి వెళ్లిన గ్రామ కార్మికులపై శ్రీకాంత్ అనే వ్యక్తి దాడి చేశాడని ఈఓ కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారసంతలో కొంతమంది వ్యక్తులు భూ కబ్జాలకు పాల్పడుతూ పకడ్బందీగా ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. ఇలా నిర్మించవద్దని గతంలో తెలియజేసినప్పటికీ పట్టించుకోకుండా ఇండ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. కార్మికులపై దాడి చేసిన శ్రీకాంత్‌పై చర్యలు తీసుకోవాలని శనివారం ఎంపీడీఓ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎంపీడీఓ పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

దివ్యాంగులు నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-నిర్మల్

స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం టిఎన్జిఓ భవనంలో దివ్యాంగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్మల్ నియోజకవర్గం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నియోజకవర్గం అధ్యక్షులుగా గుమిడ్యాల గంగాధర్, ఉపాధ్యక్షులుగా సగ్గం ముత్యం, ప్రధాన కార్యదర్శిగా గంగారాం, సహాయ కార్యదర్శిగా జాదవ్ మీనాక్షి, ప్రచార కార్యదర్శిగా వినోద్, సాయి, కోశాధికారిగా కదం భగవాన్, సలహాదారులుగా రమేష్‌రెడ్డి, సాయన్న, అయుబ్‌ఖాన్, వివేక్‌ను ఎన్నుకున్నారు. ప్రతి నెల రెండవ శనివారం సమావేశం ఉంటుందని జిల్లా అధ్యక్షులు ఇసాక్ అలీ తెలిపారు.

అనునిత్యం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
ఆదివారం 22 జనవరి 2023

29న పద్మశాలీ వధు, వరుల పరిచయ వేదిక

నవతెలంగాణ-జన్నారం

నస్పూర్ మున్సిపల్ పరిధిలోని సింగరేణి పాత కమ్యూనిటీ భవనంలో ఈ నెల 29న పద్మశాలి నూతన వధూవరుల పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్టు సింగరేణి పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చిలువేరు సదానందం తెలిపారు. శనివారం మండల కేంద్రంలో పద్మశాలి సంఘం నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిచయ వేదికకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన పద్మశాలీలు హాజరవుతారని, జిల్లా వ్యాప్తంగా పద్మశాలి కులస్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వివాహ బాంధవ్యాలను కలుపుకునేందుకు ఇది ఒక చక్కని వేదిక అవుతుందన్నారు. పద్మశాలి పిల్లల వివాహం చేయాలని భావిస్తున్న తల్లిదండ్రులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చెట్టు పెళ్లి గంగయ్య, ఆడెపు లక్ష్మీనారాయణ, శెట్టిపల్లి సత్యం, పట్టణ అధ్యక్షుడు బాలిన మధు, దూస పరిసరాములు, సిరిపురం రవీందర్, బొద్దున సత్యనారాయణ, అలిశెట్టి లక్ష్మణ్ పాల్గొన్నారు.

బదిలీలు పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలి

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రావు కోరారు. ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్‌తో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యత కేటగిరిలను సమగ్రంగా పరిశీలించి బదిలీ పాయింట్లు కెటాయించాలని, జిల్లాలోని అన్ని పాఠశాలల్లోని ఉపాధ్యాయుల ఖాళీ పోస్టులను బదిలీలు పదోన్నతుల్లో సూచించాలని కోరారు. అనంతరం సంఘం క్యాలెండర్ డైరీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆడే ప్రకాష్, రాష్ట్ర నాయకులు ఉదయభాబు, సాంబశివరావు, తాటికొండ లక్ష్మయ్య, జిల్లా నాయకులు చైతన్యకుమార్, గోవిందరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లకావత్ శంకర్, లవన్ కుమార్, పత్తిపాక శ్రావణ్ కుమార్, శివ, వివేక్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'తో సామాన్యులకు ఉపయోగం

- మంచిర్యాల కలెక్టర్ భారతి హోళికేరి

నవతెలంగాణ-హాజీపూర్

ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు 2వ విడత కార్యక్రమం సామాన్య ప్రజానికానికి ఎంతో ఉపయోగపడుతుందని మంచిర్యాల కలెక్టర్ భారతి హోళికేరి అన్నారు. శనివారం మండలంలోని దొనబండ గ్రామంలోగల ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంటి వెలుగు 2వ విడత కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, శిబిరంలో కంటి సమస్య ఉన్న వారిని పరీక్షించి మందులు, అవసరమైన వారికి కంటి అద్దాలు. పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికి కంటి వైద్య నిపుణుల ద్వారా కంటి సమస్యను పరీక్షించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్‌హై, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తాండూర్ : మండలంలోని గోపాల్‌నగర్ కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని మంచిర్యాల కలెక్టర్ భారతి హోళికేరి ఆకస్మికంగా సందర్శించారు. కంటి పరీక్షల నిర్వహణ కళ్లద్దాల పంపిణీ నిర్దేశించిన లక్ష్యాలను పరిశీలించారు. కంటి వెలుగు ద్వారా ప్రజలకు ఎంత మేరకు లబ్ది జరుగుతుందన్న విషయాన్ని అక్కడికి వచ్చిన వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ గజానంద్ ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ప్రభుత్వ వైద్యులు కుమారస్వామి ఏపీఎం పుమా నాయక్, పంచాయతీ కార్యదర్శి వసంత పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జ్ షరీనా అన్నారు. మండలంలోని బాబాపూర్ మైనారిటీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. గతంలో మాదిరి కాకుండా ప్రస్తుతం ఆన్ లైన్ విధానంలో కోర్టు సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎవరైనా కోర్టులో తమ తరపున లాయర్‌లను పెట్టుకోలేని పరిస్థితిలో ఉంటే వారికి ఉచిత న్యాయ సహకారం లభిస్తుందని దీనిని ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కిషోర్, రాజీవ్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్ జైలులో

జిల్లా కేంద్రంలోని సబ్ జైలులో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ సీనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులను జైలు జీవితం ద్వారా సరిదిద్దుకోవాలన్నారు. వ్యక్తిగత రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని వాటి గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ప్రేమ్ కుమార్, అడ్వకేట్ నరహరి పాల్గొన్నారు.

పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి క్రీడా మైదానంలో పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. దేవాపూర్, కాసిపేట పోలీస్ ఒక జట్టు మందమర్రి, రామకృష్ణాపూర్ పోలీస్ ఒక జట్టుగా క్రికెట్ మ్యాచ్ ఆడారు. హోరా హోరీగా ఆడిన మ్యాచ్‌లో దేవాపూర్, కాసిపేట పోలీస్ టీం గెలిచింది. అనంతరం ముత్యంపల్లి క్రీడా మైదానంలో జాతీయ క్రికెట్ టోర్నీకి సంబంధించిన ఫైనల్ ట్రోఫీలను కాసిపేట ఎస్సై గంగారాం, దేవాపూర్ ఎస్సై విజయేందర్, మందమర్రి ఎస్సై చంద్రకుమార్, రామకృష్ణాపూర్ ఎస్సై అశోక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆడె బాదు, ఉప సర్పంచ్ బోయిని తిరుపతి పాల్గొన్నారు.

ప్రారంభమైన కుపర్ లింగు స్వామి జాతర

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కుర్రఘడ్ గ్రామంలో శనివారం ఆదివాసీల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ పాహుండి కుపర్ లింగు స్వామి జాతర ప్రారంభమైంది. గురుస్వామి కుర్సింగ భూదేషాన్ ప్రత్యేక పూజలు చేపట్టి ప్రారంభించారు. మూడు రోజుల పాటు సాగే జాతరలో మొదటి రోజు శనివారం నవగ్రహాల ప్రతిష్టాపన, దేవుడి జెండా ఆవిష్కరించి, ప్రత్యేక పూజలతో అగ్ని గుండం ఏర్పాటు చేసి రాత్రి వరకు భజన కార్యక్రమం నిర్వహించారు. కాసిపేట మండలంతో పాటు ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు పూజల్లో పాల్గొన్నారు. జాతరకు ఆదివాసీలు తరలివచ్చి తమ మొక్కలు చెల్లించుకొని వంట చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు.

ఓఎల్ఎంఎస్‌పై డీలర్లకు అవగాహన

నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ మండలంలోని కిష్టంపేట రైతు వేదికలో శనివారం డీఏఓ కల్పన చెన్నూర్, కోటపల్లి మండలాల అగ్రికల్చర్ డీలర్లకు శనివారం ఓఎల్ఎంఎస్‌పై అవగాహన కల్పించారు. అనంతరం డీఎఓ కల్పన మాట్లాడుతూ ఫెర్టిలైజర్ ఆన్లైన్ లైసెన్స్ మేనేజ్మెంట్ సిస్టమ్ గురించి అవగాహన కార్యక్రమం కోసం సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్క డీలర్ జనవరి 26 నుంచి తమ ఫెర్టిలైజర్ లైసెన్స్‌ను ఆన్లైన్‌లో సబ్మిట్ చేయాలని తెలిపారు. ప్రతి డీలర్ స్టాక్ రికార్డ్, పీఓఎస్ మిషన్‌లో బస్తాలు సక్రమంగా మెయింటైన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడిఏ బాపు, కోటపల్లి ఏఓ మహేందర్, బీమరం ఏఓ, చెన్నూర్ ఏఓ కవిత పాల్గొన్నారు

దండేపల్లిలో పోలీసుల నాకాబందీ

నవతెలంగాణ-దండేపల్లి

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని నియంత్రించేందుకు దండేపల్లి మండల కేంద్రంలో పోలీసులు నాకాబంది నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై సాంబమూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో శాంతి భద్రతలకు విగాథం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే జరిమానాలు విధిస్తామని అన్నారు. గంజాయి రహిత మండలంగా చేసెందకు పోలీసులు శ్రమిస్తున్నారని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎవరైనా గంజాయి రవాణా చేసిన లేదా సేవించిన తమకు సమాచారం ఇవ్వాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపవద్దని, మైనర్‌లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. మైనర్లు వాహనం నడిపి పట్టుబడితే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని లోతోర్రె గ్రామానికి చెందిన బేస్ క్యాంపు వాచర్ పరుష గంగారాంను మండలంలోని కవ్వాల్‌కు చెందిన అల్లటి పోషన్న దాడి చేయటంతో శనివారం కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై పి.సతీష్ తెలిపారు. గంగారం కవ్వాలలోని పోషం ఇంటి వద్ద కర్ర చెక్కుతున్న శబ్దం విని, తమ ఫారెస్ట్ అధికారులకు ఫోన్ చేస్తానని ఫోన్ తీస్తుండగా దాడి చేశారన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోషన్నపై ఐపీసీ 290, 323, 341, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు.

'ఆకలి' మంట.. చదువుకు తంటా..!

పదోతరగతి పరీక్షలు సమీపిస్తుండటంతో సర్కారు బడుల్లోని విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక తరగతులు విద్యార్థులకు ప్రయోజనకరంగా నిలుస్తున్నా.. ఆకలి వారిని బాధిస్తోంది. మెజారిటీ బడుల్లో విద్యార్థులు ఎలాంటి అల్పాహారం తీసుకోకుండానే హాజరవుతున్నారు. మధ్యాహ్న భోజనంచేసి సాయంత్రం 6 తరువాత కూడా ఆకలితోనే ఇళ్ల బాట పడుతున్నారు. ఈ పరిస్థితులతో చదువుపై చూపలేకపోతున్నారు. అధికారుల లక్ష్యానికి ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యాలరు ఆకలితో అలమటిస్తున్నారు. ఏటా ఇదే పరిస్థితి నెలకొంటున్నా అధికారులు పట్టించుకోకపోవటంతో విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు.

- ఖాళీ కడుపుతో చదువుపై శ్రద్ధ చూపని విద్యార్థులు
- సగానికిపైగా పదో తరగతి విద్యార్థుల పరిస్థితి



నవతెలంగాణ-హాజీపూర్

జిల్లాలో మొత్తం 108 ప్రభుత్వ, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదువు కుంటున్న పదో తరగతి విద్యార్థులు మార్చి నెలలో నిర్వహించే వార్షిక పరీక్షలకు సుమారు 5వేల మంది విద్యార్థులు సిద్ధమవుతున్నారు. రెండేళ్లుగా పది ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించగా.. ఈ సారి కూడా జిల్లా విద్యాశాఖ, ఉపాధ్యాయులు మరింత మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంట్లో భాగంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. నవంబర్ నుంచి మార్చ్ వరకు ఉదయం 8.30-9.45, సాయంత్రం 4.45-5.30 గంటల వరకు విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. పొద్దున్నే తినే అలవాటు చాలా మంది విద్యార్థుల్లో లేకపోవడం, సమయం మించిపోతుందన్న ఆత్రుత, పేద, మధ్య తరగతి కుటుంబాల వారు పనుల ఒత్తిడి, వివిధ కారణాలతో సమయానికి ఆహారం సమకూర్చుకోకపోవడంతో మెజారిటీ విద్యార్థులు అల్పాహారం తీసుకోకుండానే తరగతులకు హాజరవుతున్నారు. దీంతో ఉదయం కాసేపటికే నీరసిస్తూ పడిపోవడం, తరగతి గదుల్లో ఆకలితో ఉన్న విద్యార్థులకు బోధించే పాఠ్యాంశాలు అర్థం చేసుకోలేకపోతున్నారని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. మధ్యాహ్న భోజనం వారి ఆకలిని తీరుస్తున్నా, ఎదిగే వయస్సులోని విద్యార్థులకు సాయంత్రం కాగానే ఆకలవుతోంది. దీంతో సాయంత్రం 6.30 గంటల వరకు ఆకలిగానే ఉంటుందని పలువురు విద్యార్థులు తెలిపారు.

కలెక్టర్ చరవ చూపాలి

ప్రత్యేక తరగతుల విద్యార్థులకు అల్పాహారం కోసం నిధులు అందిస్తామని కలెక్టర్ భారతి హోళికేరి గతంలో ఫలితాల సాధనపై నిర్వహించిన సమీక్షలో పేర్కొనడం ప్రధానోపాధ్యాయుల్లో, విద్యార్థుల్లో సంతోషాన్ని నింపింది. ఈసారి ఇప్పటివరకు అల్పాహారం కోసం ఎలాంటి నిధులు విడుదల కాలేదు. అక్కడక్కడ 'సత్య సాయి ట్రస్ట్' పేరుతో విద్యార్థులకు రాగి జావ, బెల్లం లాంటివి కొన్ని రోజులు మాత్రమే అందిస్తున్నారు. గ్రామాల్లోని దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఈ విషయంలో ముందుకొస్తే విద్యార్థులకు అండగా నిలిచిన వారవుతారు.

విద్యార్థులకు ఆకలి బాధ తీర్చాలి

మిట్టపల్లి తిరుపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి



పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తున్న అధికారులు వారి ఆకలి బాధలు పట్టించు కోవడం లేదు. గతంలో విద్యార్థులకు అల్పాహారం కోసం నిధుల కేటాయించారు. కానీ ఇప్పుడు ఇపుడు అధికారులు వాటిపై శ్రద్ధ చూపడం లేదు దీనితో విద్యార్థులు అర్ధాకలితో చదవలేకపోతున్నరు.

ఉదయం తినకుండానే వస్తున్నాం

ఎం.అక్షయ ,జిల్లా పరిషత్ హై స్కూల్, ముల్కల్ల,పదవ తరగతి



ఉదయం 8 గంటలకే స్కూల్‌కి అన్నం తినకుండా వస్తున్నాము. మళ్లీ సాయంత్రం 6గంటల వరకు ఇంటికి పోతున్నాము. ప్రత్యేక తరగతుల సమయంలో మాకు అల్పాహారం అందించాలి. అప్పుడు చదువుపై చదువుపై శ్రద్ధ చూపితే మెరుగైన ఫితాలు వస్తాయి.

అల్పాహారానికి నిధులు రాలేదు

ఎస్.వెంకటేశ్వర్లు, డీఈఓ మంచిర్యాల

ఎస్సెస్సీ విద్యార్థుల అల్పాహారం ఎలాంటి నిధులు లేవు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. సంబంధించిన ఫైల్ ఆమోదం పొందగానే వాటిని పాఠశాలలకు అందజేస్తాం. త్వరితగతిన నిధులు వచ్చేలా కృషి చేస్తున్నాం.

బదిలీలు, పదోన్నతుల జాబితా వెబ్ సైట్‌లో ఉంచాలి

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతుల లిస్టులను ఎప్పటికప్పుడు వెబ్ సైట్‌లో ఉంచాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైద్య శాంతి కుమారి, సోయం ఇందురావు కోరారు. జిల్లా విద్యాధికారి అశోక్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు ప్రమోషన్లు జాబితాలు రూపొందించడంలో ఎటువంటి అవకతవకలకు తావివ్వకుండా సీనియారిటీ జాబితాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించి అప్డేటెడ్ లిస్టులను ఎప్పటికప్పుడు జిల్లా విద్యాధికారి వెబ్ సైట్‌లో పొందుపరచాలన్నారు. విలేజ్ క్యాటగిరీల లిస్టును నోటిఫై చేయడంలో నిబంధనలను అనుసరిస్తూనే పారదర్శకత పాటించాలన్నారు. ఏబీసీడీ క్యాటగిరీల పాఠశాలల లిస్టులను తెలియజేయాలన్నారు. బదిలీలు ప్రమోషన్ల షెడ్యూలు జరుగుతున్న క్రమంలో పాఠశాలలోని విద్యార్థులు నష్టపోకుండా మండల, జిల్లా అధికారులు పాఠశాల సమయం అనంతరం ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండాలని కోరారు. లిస్టులో ఉన్న లోపాలు కానీ అవకతవకలు కానీ ఉన్నట్లయితే సవరణ కోసం ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు అప్పీళ్లను పరిశీలించి సవరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ నాయకులు హేమంత్ షిండే, తంగడి పెళ్లి రమేష్, కాంపెల్లి ఉషన్న, జాదవ్ సుభాష్, కోట తిరుపతి పాల్గొన్నారు.

జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలి



నవతెలంగాణ-భీమారం

కొత్తగా ప్రవేశపెట్టిన 317 జీఓతో స్థానికత కోల్పోయి ఇబ్బంది పడుతన్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం న్యాయం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్లాక్ చేయబడిన 13 జిల్లాల స్పౌజ్ కేసులను పరిష్కరించకుండా ప్రభుత్వం ఉపాధ్యాయులకు స్థాన చలనం కల్పించటం సరికాదన్నారు. దీంతో స్థానికత కోల్పోయి ఇతర జిల్లాలో పని చేస్తున్న వారికి జీరో సర్వీస్‌తో వారి పాత స్టేషన్‌ని కూడా పరిగణలోకి తీసుకోని వారికి కూడా బదిలీల్లో అవకాశం కల్పించి న్యాయం చేయాలన్నారు. క్యాడర్ విభజనలో తప్పుల కారణంగా న్యాయపోరాటంతో తిరిగి సొంత జిల్లాకు వచ్చిన ఉద్యోగుల మొత్తం పీరియడ్‌ను పరిగణనలోకి తీసుకోవాలని, పండితుల, పీఈటీల ఉన్నతీకరణ చేపట్టాలని, బదిలీలు పదోన్నతులు మరింత పారదర్శకంగా జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను విడుదల చేయాలని, జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ ఋణాలను అనుమతించాలని, పెండింగ్ మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులను తక్షణమే పరిష్కరించాలని, ఐదు నెలల పీఆర్సీ ఎరియర్స్, సీపీఎస్ ఏరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షులు జి.సంతోష్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు జలజ, లక్ష్మీ, విఠల్ పాల్గొన్నారు.

సోషల్ మీడియా వారియర్స్ సమావేశం

నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ మండలంలోని సబ్బరంపల్లి గ్రామంలో శనివారం 8 గ్రామలకు చెందిన బీఆర్ఎస్ సోషియల్ మీడియా వారియర్స్ సమావేశం నిర్వహించారు. దీనికి మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, సోషియల్ మీడియ వారియర్స్ హాజరై భవిషత్ కార్యాచరణపై చర్చించారు. కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలలో తీసుకెళ్లాలని, సోషియల్ మీడియాలో నిరంతరం ఆక్టివ్‌గా ఉండాని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర వికాస సమితి ఉపాధ్యక్షులు విజయానంద్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రవీందర్ రెడ్డి, చెన్నూర్ ఎంపీపీ మంత్రి బాపు, వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపు రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు రత్న సమ్మిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు మల్లెల దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రూప్-1 మెటీరియల్ అందజేత

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పేద విద్యార్థులైన, సుద్దాల వెంకటస్వామి, గ్రూప్-1 ప్రిపరేషన్‌కు, కుమ్మరి హరిత కానిస్టేబుల్, ప్రిపరేషన్ కోసం కావలసిన బుక్కులను శనివారం తిమ్మాపూర్ గ్రామపంచాయతీలో మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన సొంత ఖర్చులతో ఈ పుస్తకాలను ఆ పేద విద్యార్థులకు అందించామని తెలిపారు. చదువుపై ఉత్సాహంగా ఉన్న యువకులను ప్రోత్సహించడమే తమ లక్ష్యమన్నారు. గ్రామంలో ఉన్న విద్యార్థులు ఎలాంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న కూడా తమను సంప్రదిస్తే వారికి సరైన ప్రోత్సాహకాన్ని అందిస్తామన్నారు. తిమ్మాపూర్ గ్రామంలో అత్యధికంగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడానికి యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు జాడి వెంకట్, గుండ లచ్చన్న, ఆనందం, నగేష్ పాల్గొన్నారు.

ఆర్‌కె1 ఏ గనిపై భద్రత అవగాహన పక్షోత్సవాలు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఆర్ కె1ఏ గనిపై పని ప్రదేశంలో కార్మికులు వ్యక్తి గత బాధ్యతలపై శనివారం భద్రత అవగాహన పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సేఫ్టీ జీఎం బీపీఏ రీజియన్ జాన్ ఆనంద్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ఓదెలు, కె కె గ్రూప్ ఏజెంట్ రామదాసు మాట్లాడుతూ ఆర్ కె1ఏ గని రెండు సార్లు ఫైవ్ స్టార్ సాధించిందని, సేఫ్టీలో ఎప్పుడు ముందు ఉంటుంది అని కొనియాడారు. కార్మికులు అందరూ వ్యతిగత బాధ్యతలపై భద్రత అవగాహన పాటించాలని, ఆక్సిడెంట్స్ 98 శాతం మానవ తప్పిదాల వల్లనే జరుగు తున్నాయని, అలా జరగకుండా అందరూ భద్రతతో పని చేయాలని కోరారు. అనంతరం కార్మికులు, అధికారులు రక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎంటిసి ఎస్ఓఎం విజయ్ కుమార్, గని డిప్యూటీజీఎం ఏ.శ్రీధర్ రావు, గని సేఫ్టీ ఆఫీసర్ బి.జయంత్ కుమార్, పిట్ ఇంజనీర్ సతీష్ కుమార్, సర్వేయర్ నజీర్‌ఉద్దీన్, సీనియర్ అండర్ మేనేజర్ కె.రవి, గని వెల్ఫేర్ ఆఫీసర్ జె.శ్రీనివాస్, ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ పిట్ సెక్రెటరీలు ఎస్.వినయ్, బి.బిక్షపతి పాల్గొన్నారు.

కేతేశ్వర స్వామి కంకాలమ్మ ఆలయ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీ పరిధిలోని వీర్ల గుట్టపై వెలసిన శ్రీ కేతేశ్వర స్వామి, కంకాలమ్మ ఆలయ, వార్షికోత్సవ పోస్టర్లను శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్, ఖానాపూర్‌లోని తన నివాసంలో విడుదల చేశారు. ఈ నెల 29న జరగనున్న కేతేశ్వర, కాంకాలమ్మ జాతరకు రావాలని రేఖా నాయక్‌ను ఆలయ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సిలువేరీ నర్సయ్య, పిల్లిమల్లయ్య, కోడి జుట్టు రాజన్న, అరుణ్ కుమార్ అశోక్, రాజన్న పాల్గొన్నారు.

గాంధారి మైసమ్మ జాతర పోస్టర్లు విడుదల

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఫిబ్రవరి 3 నుండి 5 వరకు నిర్వహించనున్న ఆదివాసుల అరాధ్య దైవం గాంధారి ఖిల్లా మైసమ్మ జాతర గోడ పోస్టర్లను హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో శనివారం ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అలాగే ఈ జాతరకు మర్యాద పూర్వకంగా ఆహ్వానించి, గాంధారి జాతరకు చేరుకునే ప్రధాన రహదారి రూ.2.10 కోట్లతో నిర్మాణం చేసినందుకు ఆదివాసి నాయక్ పోడ్ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంజి రాజన్న, కార్యదర్శి భీంరావు, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రాజకుమార్, బాల్క సుమన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్‌పై గ్రామ సభ

నవతెలంగాణ-భీమారం

ప్రభుత్వం బలహీన వర్గాలను ప్రోత్సహించేందుకు వివిధ ఫైనాన్స్ కార్పొరేషన్ పేరట ప్రయోజనం కల్పిస్తోంది. అందులో బాగంగా మైనారిటీ కార్పోరేషన్ కింద రూణాల మంజూరు కోసం శనివారం భీమారంలో గ్రామ సభను నిర్వహించారు. స్థానిక సర్పంచ్ గద్దె రాంరెడ్డి అధ్యక్షతన ఎస్‌బీఐ బ్యాంకు భీమారం శాఖ నిర్వహించిన గ్రామ సభలో 11 మంది నుంచి స్వీకరించిన ధరఖాస్తులను బ్యాంక్ మేనేజర్ డేవిడ్, ఎంపీడీఓ శ్రీనివాస్ పరిశీలించారు. పరిశీలన పూర్తైన అనంతరం అర్హులై వారిని గుర్తించి రుణాలను మంజూరు చేస్తామని ఎంపీడీఓ తెలిపారు.

నేడు నేతకాని ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-నస్పూర్

నేతకాని మహా ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం లక్ష్మీనరసింహ గార్డెన్, ఎన్టీపీసీ రామగుండంలో నిర్వహిస్తున్నట్టు నేతకాని సమన్వయ కమిటి ప్రోగ్రాం కన్వీనర్ ఆర్కే నేత, చైర్మన్ దుర్గం రాజేశ్ దుర్గం గోపాల్ తెలిపారు. శనివారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మానవాళికి నాగరికత నేర్పిన నేతకానిలు నేడు ఉనికిని కోల్పోయే దిశలో ఉన్నారని, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగం, సామాజిక రంగాల్లో రాణించేందుకు పోరాడాల్సిన సమయం వచ్చిందని, విద్యావంతులు, మేధావులు, యువకులు, పార్టీలకి, సంఘాలకి అతీతంగా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం జరగనున్న మహా సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపెల్లి పార్లమెంట్ సభ్యుడు బోర్లకుంట వెంకటేష్ నేత, బెల్లంపల్లి శాసనసభ్యుడు దుర్గం చిన్నయ్య, స్థానిక రామగుండం శాసనసభ్యులు కోరుకంటి చందర్ పాల్గొంటారని తెలిపారు. హైదరాబాద్ వేదికగా నేతకాని కుల హక్కుల కోసం త్వరలో మహాసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నర్సయ్య, గోళ్ల రాములు, దుర్గం స్వామి, దుర్గం ప్రభుదాస్, దూట వెంకటేష్ పాల్గొన్నారు.

మందమర్రి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా జంగిలి రవీందర్

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జంగిలి రవీందర్‌ను ఆ పార్టీ మందమర్రి పట్టణ అధ్యక్షుడిగా శనివారం ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ నియమించారు. 2001 నుంచి బీఆర్ఎస్ పార్టీలో సేవలందిస్తూ గతంలో టీబీజీకేఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడిగా, పట్టణ అధ్యక్షులుగా పనిచేసిన అనుభవం పార్టీకి ఉపయోగపడనుందని ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. పట్టణంలోని కార్యకర్తలను, నాయకులను అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జంగిల్ రవీందర్ మాట్లాడుతూ మందమర్రి పట్టణ అధ్యక్షుడిగా నియమించినందుకు ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమపై పెట్టుకున్న విశ్వాసాన్ని వమ్ము చేయకుండా బీఆర్ఎస్‌ని ఎమ్మెల్యే బాల్క సుమన్ నాయకత్వాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.

24న జడ్పీ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని వొడపల్లి గార్డెన్స్‌లో ఈ నెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు జడ్పీ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు జడ్పీ సీఈఓ రత్నమాల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభ్యులు, సంబంధిత అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని కోరారు.